క్లుప్తంగా

తహసీల్దార్ కుర్చీకి వినతి



కుర్చీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: తల్లికి వందనం పథకం అర్జీలు ఇవ్వడానికి గడువు పెంచాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి సీపీఐ నాయకులు శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అయితే తహసీల్దార్ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇచ్చి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రాజ్‌గోపాల్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి అనేక ఆంక్షలు విధించిందన్నారు. సమస్యలు తెలుసుకోవడానికి వస్తే అధికారులు అందుబాటులో లేరన్నారు. మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలస్వామి, నారాయణ స్వామి, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ఎల్.తిమ్మాపురంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఈఓ లావణ్య

రొద్దం: మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య సూచించారు. శనివారం మండలంలోని ఎల్.తిమ్మాపురంలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ, గృహహింస, వేధింపులు, బాల్యవివాహాల కట్టడి, మహిళా చట్టాలపై వివరించారు. అనంతరం మహిళలపై వివక్షత, చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు, పాలకవర్గ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు



మూర్తి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని కాకి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆర్ఎస్ఎల్ఎన్ మూర్తి గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో గౌరవ ప్రధానమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి మాత్రమేన్నారు. తల్లిదండ్రుల తర్వాత పూజించేది ఒక గురువును మాత్రమే అని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఆర్ఎస్ఎల్ఎన్ మూర్తి వివిధ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరుతెచ్చుకుని అందరి మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం ఆర్ఎస్ఎల్ఎన్ మూర్తి దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేంద్ర, విశ్రాంత ఎంఈఓలు గోవిందప్ప, శివరామప్ప, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్పతో ఎంపీటీసీ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

రొళ్ల: ఇటీవల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరశాస్త్రిని శనివారం జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీఓకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శివన్న, నాగరాజు, లక్ష్మమ్మ, నాయకుడు యరగుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

కేఎన్ రాజణ్ణ జన్మదిన వేడుకలు



రాజణ్ణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

పావగడ: తుమకూరులోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఎన్ రాజణ్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య, హోం శాఖ మంత్రి పరమేశ్వర్ తదితర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కేఎన్ఆర్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రాజణ్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

దారి.. భూమిపూజతో సరి!

- రూ.44.60 లక్షలతో రోడ్డు నిర్మాణం ప్రారంభం
- ఏడాది కావొస్తున్నా ఊసేలేని పనులు



పరిగి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం



అధ్వానంగా పరిగి బస్టాండ్ - పరిగి ప్రధాన రహదారి

చిలమత్తూరు: ఎమ్మెల్యే బాలకృష్ణ పురంపై కపట ప్రేమ చూపెడుతున్నారు. గంపెడు ఆశలతో నమ్మి ఓట్లేసిన పురం ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాడు. ఎక్కడ ఎమ్మెల్యే బాలకృష్ణ అని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తున్నా నెలకోసారైనా వస్తాడేమో తమ గోడు వింటాడేమో అని ఎదురుచూసి మూడు పర్యాయాలు కావొస్తున్నా ఆయనలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. స్థానిక ప్రజల ఆక్రందనలు పట్టించుకోని ఎమ్మెల్యే ఇక్కడ జరుగుతున్న పరిస్థితులపై ఏమాత్రం అవగాహన కలిగి ఉండకపోవడంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. అంతేకాదు అభివృద్ధి పనులంటూ శంకుస్థాపనలు చేసి మమ అనిపించేస్తున్నారని విమర్శిస్తున్నారు. పట్టణంలో డ్రైనేజీ సమస్యలు, రోడ్లు, వీధిదీపాలు, తాగునీరు ఇలా ఒకటి కాదు రెండు కాదు అనేకమైన సమస్యలతో సతమతమవుతోంటే ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అంతా ప్రచార ఆర్భాటమే..

హిందూపురంలోని పరిగి బస్టాండ్ నుంచి పరిగి ప్రధాన రహదారి వరకూ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బాలకృష్ణ గతేడాది జూలై 14న రూ. 44.60 లక్షల నిధులతో భూమి పూజ చేశారు. ప్రచారం కోసం శిలాఫలకాన్నీ ఏర్పాటు చేసుకున్నారు. ఏడాది కావొస్తున్నా ఆ రోడ్డు స్థితి మారలేదు. అవే గుంతలు, వాహనదారులకు అవే అవస్థలు. అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు శిలా ఫలకాన్ని చూసి విమర్శలు కురిపిస్తున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇలా శిలా ఫలకాలెన్నో వేసి వదిలేసిన దాంట్లో ఇదీ చేరిందని, శిలాఫలకాన్ని భద్రంగా నిర్మించారంటూ ఎద్దేవా చేస్తున్నారు. హ్యాట్రిక్ బాలయ్యా..ఇది చూడయ్యా .. అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. సొంత జేబులు నింపుకునే స్థానిక కూటమి నేతలకు స్థానిక ప్రజల అవస్థలు పట్టడం లేదని పేర్కొంటున్నారు. ఆదాయ వనరులే లక్ష్యంగా కూటమి నేతలు చెలరేగిపోతుంటే ఎమ్మెల్యే బాలకృష్ణ , ఆయన కార్యదర్శులు చోద్యం చూస్తున్నారో..లేక వారే చేయిస్తున్నారో.. అంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



ఎమ్మెల్యే బాలకృష్ణ ఆర్భాటంగా రోడ్డు పనులకు భూమి పూజ చేసి వెళ్లిపోయారు. ఏడాదైనా ఇటువైపు చూసిన వాళ్లు లేరు. వాహనదారులతోపాటు బాపూజీ నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నేత, బాపూజీ నగర్

'జేజేఎం పథకాన్ని నిర్వీర్యం చేశారు'



అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ అనంతరాజు

రొళ్ల: గ్రామాల్లో ఇంటింటికీ ఇంటింటికీ నీరు అందించాల్సిన (జేజేఎం) జల్ జీవన్ మీషన్ పథకాన్ని పాలకులు నిర్వీర్యం చేశారని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మాట్లాడుతూ.. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో జేజేఎం పథకం ద్వారా పూర్తి స్థాయిలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నారని గుర్తు చేశారు. అయితే మన రాష్ట్రంలో జేజేఎం పథకాన్ని పాలకులు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జేజేఎం ద్వారా నీటిని సరఫరా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది రుపాయల నిధులు కూడా వెచ్చిందన్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ, విద్యుత్, విద్యాశాఖ, విద్యుత్‌శాఖ ఇతరత్రా శాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలో జరిగే కార్యక్రమాలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ కవిత నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, వైస్ ఎంపీపీ నాగరాజు, ఏఓ వెంకటబ్రహ్మం, విద్యుత్‌శాఖ ఏఈ నిజాముద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేట వేంకటరమణ ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో పేట వేంకటేశ్వరస్వామి

హిందూపురం: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వివిధ అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.అనంతరం స్వామి మూలవిరాట్‌ను పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

శనేశ్వరాలయంలో..

పట్టణంలోని డీబీకాలనీ, టీచర్స్‌కాలనీలోని శనేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి తిలతైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెండి కవచ అభరణాలతో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. జ్యేష్టాదేవి సమేత శనిదేవుడి ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలంకరణలు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వందలాది భక్తులు ఆలయం ఎదుట తిల తైలాలతో దీపారాధనలు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని నిరసన

తలుపుల: లక్కసముద్రం పంచాయతీలోని గజ్జలప్పగారిపల్లి గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను తొలగించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం చెబుతుంటే ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ పనులు కల్పించడం లేదన్నారు. కేవలం తనకు నచ్చిన వారికి మాత్రమే పనులు కల్పిస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. వెంటనే అతడి అవినీతిపై విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, అంజన్ బాబు, సిద్దయ్య కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.


శిక్ష అనుభవంతో మార్పు రావాలి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్


హిందూపురం: క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వచ్చిన ఖైదీల్లో శిక్ష అనుభవంతో మార్పు రావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కోసం తయారుచేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఖైదీలతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పు చేసి జైళ్లకు రావడం వల్ల కుటుంబ గౌరవ మర్యాదలు దెబ్బ తినడంతోపాటు ఆర్థికంగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మార్పు వచ్చి ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదుల బాక్సులో వేయాలన్నారు. వాటిన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, సంతోషి కుమారి, రవిచంద్ర, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పి.ఎల్.వి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మున్సిపల్ పరిధిలోని తిమ్మాపురం వద్ద స్కూల్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ట్రాన్స్‌కో అధికారులు గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అయితే వాటి చుట్టూ ఎలాంటి రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఏ మాత్రం పొరబాటు జరిగినా ప్రాణాలు గాల్లోకి కలసిపోయో అవకాశం ఉందన్నారు. ప్రధానంగా జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, విద్యాలయాల సమీపంలో చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మడకశిర రోడ్డులో దర్బార్ హోటల్ సమీపంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బొక్సంపల్లిలో నేడు 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

రొద్దం: మండలంలోని బొక్సంపల్లి పంచాయతీలో ఆదివారం కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్ కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

'యువత పోరు' విజయవంతం చేయండి

మడకశిరరూరల్: విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 23న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమన్వయకర్త ఈరలక్కప్ప, యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో యువత జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేయలేదని ఆరోపించారు. విద్య వ్యవస్థ నిర్వీర్యమైందని తెలిపారు. ఫీజు రియింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలు ఊసే లేకపోవడంతో పేద కుటుంబాల పిల్లలు చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా టాపర్‌కు సత్కారం



విద్యార్థిని బిందును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బిందు ఇంటర్మీడియట్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ భీముడు నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థినిని శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిందు 980 మార్కులు సాధించడంతో వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) లో ఉచిత సీటు, హాస్టల్ వసతి కూడా పొందడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థిని అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి టౌన్: సొంత బావపై దాడి చేసిన బామ్మర్దిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నిజాంవలీ కాలనీలో నివాసం ఉన్న బాబాఫక్రోద్దీన్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అయితే అతడికి భార్యకు మధ్య మనస్పర్థలతో గొడవలు తలెత్తాయి. ఈక్రమంలో శనివారం ఉదయం బామ్మర్ది ముజాహిద్ బావ ఫక్రోద్దీన్‌పై ఇనుపరాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముజాహిద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ధర్మవరం అర్బన్: ఇంట్లో ఉన్న భార్య, భర్తలపై దాడి చేసి గాయపరచడమే కాకుండా వారిని కులం పేరుతో దూషించిన ముగ్గురిపై టూ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-3లో నివసిస్తున్న కొడావత్ సుగుణబాయి, భర్త కృష్ణనాయక్‌లు వారికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఆ స్థలం పక్కనే నివసిస్తున్న రామాంజి ఇంటి ముందున్న వేపచెట్టు కొమ్మలు వీరి స్థలంలోకి వచ్చాయి. వేపచెట్టు కొమ్మలు తొలగించుకోవాలని సుగుణబాయి దంపతులు రామాంజిని కోరారు. అయితే వేపచెట్టు తొలగించమని ఏమి చేసుకుంటారో చేసుకో అంటూ వారం రోజుల క్రితం రామాంజి బెదిరించాడు. శనివారం సుగుణబాయి, కృష్ణనాయక్ ఇంటిలో ఉండగా రామాంజి, అతని భార్య చెన్నకృష్ణమ్మ, అత్త లక్ష్మీదేవి ఇంటిలోకి ప్రవేశించి మాతోనే పెట్టుకుంటారా అంటూ కులంపేరుతో దూషించడంతోపాటు భార్య, భర్తను బయటకు లాగి సుగుణబాయి జాకెట్, చీరను చింపి అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు కిందపడేసి కాళ్లు, చేతులతో కొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసుతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ రెడ్డప్ప తెలిపారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



పెనుకొండ కోర్టు ఆవరణలో యోగాలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



హిందూపురం కోర్టు ఆవరణలో సూర్య నమస్కారం చేస్తున్న న్యాయమూర్తులు



మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పెనుకొండ/పెనుకొండ రూరల్/రొద్దం/పరిగి/గోరంట్ల: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శనివారం పెనుకొండ పట్టణంలోని కోర్టు ఆవరణంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి వాసుదేవన్ యోగా ప్రాశస్త్యతను వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బొజ్జప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఏజీపీ భాస్కరరెడ్డి, మాజీ ఏపీపీ నాగరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలు ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది, నగర పంచాయితీ పరిధిలోని మంగాపురం, వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం తదితర గ్రామాల్లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, కేశవరావు, కమీషనర్ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పెనుకొండ మండలంలోని గుట్టూరు,రాంపురం జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ నరేష్ కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు నాగార్జున, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే రొద్దం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పరిగి, గోరంట్ల మండలాల్లో నిర్వహించిన యోగా దినోత్సవంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం/ లేపాక్షి/చిలమత్తూరు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం అంతార్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి కం పల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య యోగసనాలు వేశారు. సంతేబిదనూరు ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ సరస్వతి ఆయుష్మమాన్ భారత్ వైద్య అదికారి అనురాధ అధ్యర్యంలో కార్యక్రమం నిర్వహించారు. చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో కార్యక్రమం జరిగింది.

మడకశిరలో..

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా గురువు పట్టణ ప్రముఖులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా చేయడం ద్వారా కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. యోగా ఆరోగ్యానికి చాలా ముఖ్యమని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట లక్ష్మమ్మ, కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.